క్లుప్తంగా

నేడు మార్కండేయ జయంతి

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయంలో శనివారం మార్కండేయ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం శివుడు, మార్కండేయస్వామికి రుద్రాభిషేకం, పుష్పార్చన, మహా మంగళహారతి, సాయంత్రం మార్కండేయ డోలారోహణం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

అనుభవజ్ఞులతో విద్యాబోధన

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక



అడ్మిషన్ల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతోందని ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. 2025– 26 విద్యా సంవత్సరానికి ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల బ్రోచర్‌ను వైస్ ప్రిన్సిపాల్ సురేశ్ తదితర అధ్యాపక బృందంతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్ సెల్, టీ ఎస్కేసి, జిజ్ఞాస, క్రీడలు, మహిళా సాధికారత, రెడ్ రిబ్బన్, ఏకో, సాహిత్య, సాంస్కృతిక విభాగాలతో విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి చెందేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. బోధనకు అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కళాశాలలో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. కొత్తగా చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు పలువురు నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఉత్సవాలు ఫిబ్రవరి 2న ప్రారంభం కానున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడురి భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డిలకు ఆహ్వానం అందజేశారు. నాయకులు నర్సింహ, యాదగిరి, కేశవులు, పాపయ్య, రాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజారులు దినేశ్ శర్మ, శ్రీనయ్యల నేతృత్వంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్, సభ్యులు చంద్రశేఖర్, లక్ష్మయ్య, శ్రీధర్, కిశోర్, నర్సింహ, రమేశ్, తేజవర్ధన్, శివకుమార్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శికి సత్కారం



మణికంఠను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెర్కు మణికంఠను పట్టణంలో ఆ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. నాయకులు గుత్తి బాలస్వామి, మహేశ్‌నేత, గణేశ్, యాదయ్య ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్టీఓ సుభాష్ చందర్

తుర్కయంజాల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణ శాఖ అధికారి సుభాష్ చందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా మన్నెగూడ ఆర్టీఓ కార్యాలయం నుంచి బీఎన్ రెడ్డి నగర్ వరకు బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చందర్ రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే సమయంలో సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని చెప్పారు.

'చెత్త' ప్రకటనలు.. బుట్టదాఖలు

బోర్డుల ఏర్పాటుకే పరిమితం

- ఆచరణలో అధికారులు విఫలం
- చెత్తడంప్‌పై పురప్రజల ఆగ్రహం



పెద్దఅంబర్‌పేట బస్టాప్ వద్ద పేరుకుపోయిన చెత్త

అబ్దుల్లాపూర్‌మెట్: 'మీరు సీసీ కెమెరాలో కనిపిస్తున్నారు. ఇక్కడ చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా పడుతుంది' అని మున్సిపాలిటీ అధికారులు బహిరంగ ప్రదేశాల్లో నిత్యం మైకుల ద్వారా చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు, ప్రజల్లో చైతన్య తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. సీసీ కెమెరాలను సైతం అమర్చారు. బోర్డులను ఏర్పాటు చేశారు. కానీ వీటిని చెత్తసేకరించే పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యం చేస్తున్నారు. 'చెత్త'ప్రకటనలుగా భావిస్తూ చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఇలా ఇళ్లల్లోంచి సేకరించిన



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చెత్తను రోడ్డుపైన పారబోస్తున్నా.. ప్రకటనలు చేస్తున్న అధికారులు పట్టించుకోక పోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇందుకు నిదర్శనం పెద్దఅంబర్‌పేటలోని తాజా పరిస్థితులు అద్దంపడుతున్నాయి.

అటు బోర్డు.. ఇటు డంప్

పెద్దఅంబర్‌పేట చెక్‌పోస్ట్ భవనం ఎదుట జాతీయ రహదారి పక్కన కొంత కాలంగా వివిధ కాలనీల నుంచి సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు డంపు చేస్తున్నారు. దీంతో విపరీతమైన దుర్వాసన వస్తుందని ప్రాంత ప్రజలు, వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చెత్త కుప్పల్లో పందులు సంచరిస్తూ.. చెల్లచెదురుగా చేస్తున్నాయని, దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. ఇదే విషయమై పలువురు పురపాలక సంఘం అధికారులకు ఎన్నిసార్లు విన్నపించినా పట్టించుకోకపోవడం లేదని ఆరోపిస్తున్నారు. చెత్తకుప్పలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయని పేర్కొంటున్నారు. రోడ్డుకు అవతలి పక్కన చెత్తను వేయకూడదని బోర్డును తగిలించిన అధికారులే.. రోడ్డుకు ఇవతలి భాగంలో చెత్తను డంపు చేయిస్తుండటం విశేషం.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన



ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియని, ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తున్నామని వెల్లడించారు. అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశామని తెలిపారు. పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, పీసీబీ సభ్యులు బాలాజీసింగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాజీ సభ్యురాలు అనిత విజయ్, వైస్ఎంపీపీ అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, ఎంపీడీఓ మాధవి, తహసీల్దార్ లలిత పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

మీర్‌పేట: కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట జిల్లెలగూడలోని జెనిగె అడివమ్మ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నామకరణం బోర్డును శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీవాసులంతా ఐకమత్యంగా ఉండి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

అందుబాటులో లేని అధికారులు

- ఆగమవుతున్న అన్నదాతలు
- బీఆర్ఎస్ నేతల నిరసన
- ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేత



రైతువేదికలో అధికారి కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల: వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో లేక.. అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల పరిధి ఆరుట్ల రైతు వేదికలో అధికారుల లేక, వారి కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో ఆ కుర్చీలకు నాయకులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. సాగులో మెలకువలు, సమస్యలు తీర్చేవారు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రైతు భరోసా పథకంపై స్పష్టత కొరవడి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సాగుసాయం కోసం కర్షకులు రైతు వేదికల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. శాఖ అధికారులు అందుబాటులో ఉండి, కనీసం దరఖాస్తులైనా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి మహేందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ జానీ పాషా, గొర్ల, మేకల పెంపకం దార్ల సంఘం చైర్మన్ జంగయ్య, పార్టీ సీనియర్ నాయకులు జంగయ్య, వెంకటేశ్, శ్రీకాంత్, రాజు, బాలరాజు, వేణు, రాము, పెద్దులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహప్రతిష్ఠాపనోత్సవం

ఉత్సవంలో పాల్గొన్న తాజామాజీ ప్రజాప్రతినిధులు, గౌడసంఘం నాయకులు



హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో గౌడసంఘం నాయకులు తదితరులు

ఆమనగల్లు: విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణంలోని శ్రీ కంఠ మహేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పబ్బతి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. నూతనంగా హనుమాన్, రేణుక ఎల్లమ్మ, మైసమ్మతల్లి, నవగ్రహాలను ప్రతిష్ఠించారు. అర్చకులు మఠం శేఖరయ్యస్వామి, విరూపక్షస్వామి, మల్లికార్జున శాస్త్రి, శ్రీకాంత్‌శాస్త్రి, బానుప్రకాశ్ శాస్త్రీల నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు, హోమం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగారవీందర్, ఉపాధ్యక్షులు నారాయణగౌడ్, యాదయ్యగౌడ్, కార్యదర్శి నిరంజన్‌గౌడ్, కోశాధికారి బాలకృష్ణగౌడ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వంశీచంద్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప పోరాటయోధుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీ కంఠ మహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ, గౌడసంఘం ఆధ్వర్యంలో పాపన్న విగ్రహాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్‌లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పాపన్నగౌడ్ హైదరాబాద్ తురుష్కుల ఆగడాలను అరికట్టేందుకు వారిపై దండయాత్ర చేశారని తెలిపారు.

శెట్టిపల్లి బ్రహ్మోత్సవాలకు వేళాయె



వేంకటేశ్వరస్వామి దేవాలయం

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు
- 3న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి



అలివేలుమంగమ్మ

ఆమనగల్లు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ అలివేలు మంగాసమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి 6వ తేదీ వరకు జరగనున్నాయి. కల్వకుర్తి ప్రాంతంలో ప్రారంభమయ్యే తొలి బ్రహ్మోత్సవాలు.. మండల పరిధి శెట్టిపల్లి ఉత్సవాల నుంచే ప్రారంభం కావడం విశేషం. ఏటా 5 రోజుల పాటు వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఏర్పాట్లను గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, ట్రస్టీ జగన్‌మోహన్‌లు పర్యవేక్షిస్తున్నారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 2న సాయంత్రం గణపతి పూజ అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 3న స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, 11 గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన ఉంటుంది. 4న సుదర్శన హోమం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 11 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, 5న ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, 6న స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, బ్రాహ్మణ సత్కారాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించనున్నారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

3 నుంచి వాలీబాల్ టోర్నీ

ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించనున్నారు. బాలురు, బాలికలు పాఠశాల స్థాయి విభాగంలో పోటీలు జరగనున్నాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, షీల్డులను ప్రదానం చేయనున్నారు.

010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి

మంచాల: ఉపాధ్యాయుల వేతనాలు 010 పద్దు కింద చెల్లించాలని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నోముల పరిధి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి, తపస్ కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల వేతనాలు ప్రతి నెల ఆలస్యంగా జమ అవుతున్నాయని తెలిపారు. 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని కోరారు. డిప్యూటీ వార్డెన్ విధుల నుంచి గురుకుల టీచర్లను మినహాయించాలని సూచించారు. గురుకుల పాఠశాలల సమయపాలన మార్చాలన్నారు. నైట్ కేర్ టేకర్ డ్యూటీ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావల్సిన పీఆర్సీ ప్రకటించి, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భరత్ కుమార్, తపస్ మండల కోశాధికారి బాలరాజ్, తపస్ గురుకుల కన్వీనర్ రెడ్డమోని జంగయ్య, కో-కన్వీనర్ రావుల మల్లేశ్, గురుకుల బృందం మధు, మహేశ్, నర్సింహ, సురేష్‌రాథోడ్, జోసఫ్, కాశయ్య, వేదకిరణ్, వినయ్, రవి, సూరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్‌కేపురం ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ లక్ష్మీ గణపతి, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆహ్వానం అందజేత

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీ చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ శుక్రవారం రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వానం అందించారు. అలాగే ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరగా, అందుకు ఆయన తన వంతు సహకారం అందిజేస్తామని చెప్పారన్నారు.

ఎంపీటీసీల ముసాయిదా జాబితా ప్రదర్శన

మండలంలో 11 నుంచి 8 స్థానాలకు తగ్గింపు

ఎంపీటీసీ స్థానం	పరిధి గ్రామాలు
1.అబ్దుల్లాపూర్-1	అబ్దుల్లాపూర్
2.అబ్దుల్లాపూర్-2	అబ్దుల్లాపూర్
3.బండరావిరాల	బండరావిరాల, చిన్నరావిరాల
4. కవాడిపల్లి	కవాడిపల్లి, బలిజగూడ
5.అనాజ్‌పూర్	అనాజ్‌పూర్
6.లష్కర్‌గూడ	లష్కర్‌గూడ, ఇనాంగూడ, గండిచెరువు
7.మజీద్‌పూర్	మజీద్‌పూర్, గుంతపల్లి, జాఫర్‌గూడ
8.బాటసింగారం	బాటసింగారం, పిగ్లీపూర్

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఎంపీటీసీ స్థానాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించామని ఎంపీడీఓ శ్రీవాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 11 స్థానాలు ఉండగా, 2024 సెప్టెంబర్‌లో 4 గ్రామ పంచాయతీలు (తారమతిపేట, గౌరెల్లి, బాచారం, కుత్బుల్లాపూర్) సమీప పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘంలో విలీనం చేసినట్లు పేర్కొన్నారు. దీంతో 3 ఎంపీటీసీ స్థానాలు తొలగించగా.. ప్రస్తుతం 8 ఎంపీటీసీ స్థానాల ముసాయిదా జాబితాను ప్రదర్శించామని ఆమె పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే మండల ప్రజల నుంచి స్వీకరించి, 1, 2 తేదీ నాటికి పరిష్కరించి 3న తుది జాబితాను ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. అధికారులు రూపొందించిన ప్రకారం 8 ఎంపీటీసీ స్థానాల్లోని గ్రామాలు ఇలా ఉన్నాయి.

స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా జగదీశ్



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా(సీఐ) జగదీశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మాడ్గుల పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ఆయన విధులు నిర్వహించారు. డిసెంబర్ 2న జరిగిన కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నాటి సీఐ సత్యనారాయణను హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం మంచాల సీఐ మధు ఈ స్టేషన్ ఇన్‌చార్జిగా కొనసాగుతూ వచ్చారు. సుమారు 55 రోజుల అనంతరం రెగ్యులర్ సీఐగా జగదీశ్ బాధ్యతలు చేపట్టారు.

జాతరకు ఏర్పాట్లు చేయండి



గరిగుట్ట పెద్దమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కేఎల్లార్

మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి జాతరకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) కోరారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్న జాతరను పురస్కరించుకొని శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడవిలో జరిగే ఈ జాతరకు వేలాది మంది భక్తులు విచ్చేయనున్న దృష్ట్యా రహదారిపై ఉన్న గోతులను మొరంతో నింపాలన్నారు. ఆలయం వద్ద నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్ బాబా, సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ యాదగిరి, నాయకులు షేక్ జహంగీరుద్దీన్, యూసుఫ్ ఖాద్రీ, నవీన్ గౌడ్ ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానించి జ్ఞాపికలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలలో 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వారంతా ఇబ్రహీంపట్నం పరిధిలోని ఓ రిసార్ట్‌లో సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకుని సంతోషంగా గడిపారు. అలనాటి ఉపాధ్యాయులు జంగయ్య, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, వెంకట్‌రెడ్డి, కిషన్ రెడ్డి, రాధాకృష్ణమూర్తి, రాజు తదితరులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం వినోబా నగర్‌లో ఉన్న మాత పితా వృద్ధాశ్రమంతో పాటు స్ఫూర్తి ఫౌండేషన్‌లోని దివ్యాంగ అనాథలకు రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ జైపాల్‌రెడ్డి, డి.రాంచందర్, కె.రాములు, బాలనరసింహ, అరవింద్‌రెడ్డి, పవన్‌కుమార్, దేవదాసు, జంగయ్య, అమృత, కిరణ్, అలివేలు, కవిత, సుమలత, జయంతి, ప్రమోదలక్ష్మి, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.